క్లుప్తంగా

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు


అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆర్బీకేల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలి


కొటార్వేడు ఆర్బీకే రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ హేమలత

కార్వేటినగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుభరోసా కేంద్రాల్లో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఏఓ హేమలత అన్నారు. సోమవారం మండల పరిధిలోని డీఎం పురం, కొటార్వేడు, గోపిశెట్టిపల్లిలోని రైతు భరోసా కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులకు రైతుభరోసా కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న ఎరువులు, విత్తనాల సమాచారాన్ని డ్యాష్ బోర్డులో నమోదు చేయాలన్నారు. అనంతరం ఆర్బీకేల రికార్డులను పరిశీలించారు. అలాగే డీఎం పురంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న రెతుభరోసా కేంద్రాన్ని పరిశీలించారు. ఏఈఓ గాయత్రి, హేమాద్రి, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ పోస్టర్ల విడుదల


పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నగరి : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం తరపున నిర్వహించనున్న రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను సంఘ నాయకులు విడుదల చేశారు. సోమవారం స్థానిక బస్టాండు ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంఘ నాయకులు గోవింద స్వామి, గాంధీ పోస్టర్లను కరపత్రాలను విడుదల చేసి సంఘ సభ్యులకు అందజేశారు. ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

బుద్ధిమాంద్యం విద్యార్థులకు దుస్తుల వితరణ


దుస్తులు పంపిణీ చేస్తున్న పాస్టర్ సరోజిని అగస్టీన్

కార్వేటినగరం: భవితా కేంద్రంలోని బుద్ధిమాంద్యం విద్యార్థులకు యెహోవా ఈరో చర్చి పాస్టర్ సరోజిని అగస్టీన్ ఆధ్వర్యంలో ఈస్టర్ పండుగను పురస్కరించుకుని సోమవారం దుస్తులు వితరణ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ ఏటా ఈస్టర్ సండేను పురస్కరించుకుని పేదలకు, వికలాంగులకు అన్నదానం, దుస్తులు పంపిణీ చేయడం ఆనవాయితీ అన్నారు. కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయురాలు సింధుజ, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయండి

పెనుమూరు(కార్వేటినగరం) : మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలసికట్టుగా పని చేయాలని ఎంపీపీ ఎం.హేమలతా రెడ్డి అన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వారి గ్రామాల్లోని సమస్యలను చెబితే వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ గ్రామాల్లో డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, వేలాడుతున్న విద్యుత్ తీగలను ఇళ్లపై లేకుండా చూడాలని ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివయ్య, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సాఫీగా చివరి మజిలీ

మనిషి చనిపోతే అనుభవించే బాధ కంటే వారి చివరి మజిలీకి ఉన్నవారు పడే బాధలు అన్నీఇన్నీ కావు ఇప్పటికీ చాలాచోట్ల. శ్మశానాలకు వెళ్లడానికి దారి లేక మృతదేహాలను పొలాల గట్ల మీద, ముళ్లకంపల మీద ఇబ్బంది పడుతూ తీసుకెళ్లాల్సిన సంఘటనలు మనకు తారసపడిన సందర్భాలు ఉన్నాయి. అయితే చివరి మజిలీకి ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదని భావించారు మంత్రి ఆర్‌కే రోజా. నగరి నియోజకవర్గంలోని పుత్తూరులో సరికొత్త హంగులతో శ్మశానాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఎంపీ నిధులతో పాటు ఎంపీ కోటా నుంచి నిధులు మంజూరు చేయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా శ్మశానంలో వసతులు ఏర్పాటు చేయిస్తున్నారు.

- రూ.1.10 కోట్లతో విద్యుత్ దహన వాటిక
- రూ.24 లక్షలతో ప్రహరీ నిర్మాణం
- మంత్రి ఆర్‌కే రోజా చొరవతో జోరుగా పనులు


పూర్తయిన దహన వాటిక భవనం


కర్మక్రియల షెడ్డు


నూతనంగా నిర్మించిన ప్రహరీ, సిమెంట్ రోడ్డు

పుత్తూరు రూరల్: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణంలోని శ్మశాన వాటికను ఆధునీకరించాలని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సంకల్పించారు. తిరుపతిలోని గోవిందధామం తరహాలో విద్యుత్ దహన వాటికను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు ఎంపీ లాడ్స్ నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయించడమే కాకుండా, 15వ ఆర్థికసంఘం నుంచి మరో రూ.60 లక్షలను కేటాయించారు. మొత్తం రూ.1.10 కోట్ల నిధులతో విద్యుత్ దహన వాటికతో పాటు శ్మశాన వాటికలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. విద్యుత్ దహన వాటిక భవన నిర్మాణం పనులు చివరిదశకు చేరుకున్నాయి. కర్మక్రియల కోసం ప్రత్యేక షెడ్డుతో పాటు మహిళలకు, పురుషులకు ప్రత్యేక స్నానాల గదులను ఏర్పాటు చేశారు. శ్మశాన వాటిక లోపలి భాగంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తయింది. విద్యుత్ యంత్రాలు, అస్థికలు భద్రపరిచేందుకు ప్రత్యేక లాకరు, శవ వాహనం, ఫ్రీజర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటితో పాటు శ్మశాన వాటిక ఆవరణలో శివుని విగ్రహ ప్రతిష్టతో పాటు పలు రకాల పూల మొక్కలను పెంచేలా ఏర్పాట్లు చేయనున్నారు. అలాగే 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.24 లక్షలతో ఉత్తర దిశగా సరిహద్దు ప్రహరీ గోడను సైతం నిర్మించారు.

టెండర్ల ద్వారా క్రిమెటోరియం పనులు..



దహనవాటిక భవనంలో క్రిమెటోరియానికి సంబంధించిన విద్యుత్ యంత్రాలు, ఇతర పరికరాలు అన్నీ టెండర్ ద్వారా ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇందుకు సంబంధించిన కొన్ని కంపెనీల నుంచి కొటేషన్లను స్వీకరిస్తున్నాం. ఇందులో భాగంగా సోమవారం చెన్నైకి చెందిన ఓ కంపెనీ ప్రతినిధులు భవనాన్ని పరిశీలించారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తాం.

\- కేఎల్ఎన్‌రెడ్డి, కమిషనర్, పుత్తూరు మున్సిపాలిటీ

వైస్ ఎంపీపీ ఉపేంద్ర కుటుంబానికి పరామర్శ


పృథ్వీరాజు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

వడమాలపేట : వడమాలపేట వైస్ ఎంపీపీ ఉపేంద్ర కుటుంబాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖా మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. ఇటీవల ఉపేంద్ర బావమరిది పృథ్వీరాజు రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా సోమవారం కర్మక్రియలకు హాజరై కుటుంబ సభ్యులను ఓదార్చారు. చిన్న వయసులో పృథ్వీరాజు ప్రమాదంలో మరణించడం దురదృష్టకరం అని అన్నారు. వారి కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కన్వీనర్ సదాశివయ్య, నాగభూషణంరాజు, మధు, రమణరాజు, సురేష్‌రాజు, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


టైలరింగ్‌లో శిక్షణను ప్రారంభిస్తున్న బ్యాంకు మేనేజర్ కల్యాణ్

పుత్తూరు రూరల్: చేతివృత్తుల్లో శిక్షణతో పాటు రుణాలు పొందుతున్న మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ కల్యాణ్ తెలిపారు. సోమవారం స్థానిక రాష్ట్రీయ సేవాసమితి (రాస్) కార్యాలయంలో జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీషియన్, ఆర్లా వర్క్‌పై 3 నెలల ఉచిత శిక్షణా తరగతులను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కల్యాణ్ మాట్లాడుతూ రాస్ సంస్థ వందలాది మందికి నిరంతరం చేతివృత్తులపై ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. వివిధ రంగాల్లో శిక్షణ పొందుతున్న మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం పలు రకాల ప్రోత్సాహకాలతో పాటు రుణాలను అందిస్తోందని, తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించడానికి కృషి చేయాలని చెప్పారు. జన్ శిక్షణ్ సంస్థాన్ అధికారి శ్రీహరి మాట్లాడుతూ రోజూ 2 గంటల పాటు 20 మందికి 84 రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. టైలరింగ్‌కు అవసరమైన వస్తువులు, మిషన్లు, ఆర్లా వర్క్ మెటీరియల్, బ్యూటీషియన్ కిట్స్ ఉచితంగా అందించారు. కార్యక్రమంలో రాస్ అధికారులు రవి, బాలమ్మ, జయంతి, లావణ్య, తేజ, ఉష, 70 మంది మహిళలు పాల్గొన్నారు.

సకాలంలో గర్భిణులకు వైద్య పరీక్షలు


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మోహన్‌కృష్ణ

పాలసముద్రం : మండల పరిధిలోని ప్రతి గర్భిణులు సకాలంలో వైద్య పరీక్షలు చేసుకుని ప్రభుత్వ ఆస్పత్రిల్లో ప్రసవం చేసుకుంటే మాతాశిశు మరణాలు జరగవని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. సోమవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంగా గర్భిణులకు అన్నిరకాల వైద్యపరీక్షలు ఉచితంగా చేశారు. ఆస్పత్రికి వచ్చిన గర్భిణులకు హిమోగ్లోబిన్, బ్లడ్ షుగర్, బ్లడ్ గ్రూపింగ్, వీడీఆర్ఎల్, హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ వంటి పరీక్షలు చేశారు. డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారంతో పాటు మజ్జిగ, పండ్లరసం, ఆకుకూరలు, ఎక్కువగా నీరు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు నెలసరి వైద్య పరీక్షలు తప్పక చేసుకోవాలన్నారు. అనంతరం 37 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళి, గర్భిణులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

నగరి : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను మంగళవారం ఉదయం 10 గంటలకు వేలం వేస్తున్నట్లు సీఐ శ్రీనివాసంతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీఎస్టీ ఉన్నవారు వేలంలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి ఉన్నవారు వారి జీఎస్టీ వివరాలతో ఉదయం 10 గంటలకు పోలీస్ స్టేషన్‌కు విచ్చేసి వేలంలో పాల్గొనాలన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి


పాఠశాలను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ షన్మోహన్

గంగాధరనెల్లూరు: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షన్మోహన్ కోరారు. మండలంలోని సరివిరెడ్డిపల్లి సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల మొత్తం కలియతిరిగి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం అందిస్తున్న భోజనం నాణ్యతగా పెడుతున్నారా అని విద్యార్థులను ప్రశ్నించారు. భోజనం రుచికరంగా ఉందని సమాధానం చెప్పారు. అయిదో తరగతి వరకు తెలుగుమీడియంలో చదివిన మీకు, ఇప్పుడు ఇంగ్లిషు మీడియంలో పాఠాలు అర్థం చేసుకుంటున్నారా? అని అడగ్గా, అర్థమవుతున్నాయని విద్యార్థులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాఠ్యాంశాలను అర్థం చేసుకుని చదవాలన్నారు. పాఠశాలలో మొత్తం 480 మంది విద్యార్థులు ఉన్నారని డీసీఓ డాక్టర్ జయభారతి కలెక్టర్‌కు వివరించారు. తహసీల్దారు ఇన్బనాథన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి


ఆధార్ సేవలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ సుధాకరరావు

వెదురుకుప్పం: గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్ సేవల ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుధాకరరావు అన్నారు. సోమవారం మండలంలోని ఆళ్లమడుగు గ్రామ సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ సేవలు గ్రామ సచివాలయాల్లో కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఆధార్ కార్డులో కరెక్షన్లు, మార్పులు ఉన్నా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సచివాలయ సి బ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సమ స్యలను తక్షణమే పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ లోకనాథరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ధనంజయరెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, దామోదరరెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌కే సెల్వమణి నామినేషన్ దాఖలు


నామినేషన్ దాఖలు చేస్తున్న ఆర్కే సెల్వమణి

నగరి : సౌత్ ఇండియన్ ఫిల్మ్ వర్కర్స్ ఫెడరేషన్ ఎన్నికల్లో భాగంగా తమిళనాడు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ పదవికి మంత్రి ఆర్‌కే రోజా భర్త, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ ఎన్నికల్లో తమిళనాడు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ తరపున ఆర్కేసెల్వమణి నేతృత్వంలో ఆయన గ్రూపు సభ్యులుగా ప్రధాన కార్యదర్శి, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ కార్యదర్శి పదవికి బి.స్వామినాథన్, కోశాధికారిగా సెంథిల్‌కుమార్, మేకప్‌మెన్ యూనియన్ అధ్యక్షుడిగా శబరిక్రిషన్, ఆర్ట్ డైరెక్టర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా మోహన మహేంద్రన్, స్టంట్ యూనియన్ అధ్యక్షుడిగా తవసిరాజ్, కొరియోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా మారి, జాయింట్ కార్యదర్శులుగా రామలింగం, పురుషోత్తముడు, సజిత, రాజ రత్నం, రామచంద్రన్ నామినేషన్లు వేశారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం


సీఎం జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

వెదురుకుప్పం: మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కామసాని పద్మనాభరెడ్డి అన్నారు. మండలంలోని ఆళ్లమడుగు గ్రామ సచివాలయ పరిధిలో 15 స్వయం సహాయక సంఘాలకు గానూ వైఎస్సార్ ఆసరా కింద మూడోవిడత రూ.11,25,078 జమ అయింది. సోమవారం దిగువపల్లాలు పంచాయతీ కార్యాలయంలో డ్వాక్రా మహిళలు పెద్దఎత్తున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో సీఎం దశలవారీగా డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో డ్వాక్రా మహిళలను అన్ని రకాలుగా మోసం చేసినట్లు గుర్తు చేశారు. మహిళల కష్టాలను చూసిన ముఖ్యమంత్రి ఏ పథకం అమలు చేసినా మహిళలకే పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. మహిళలు మరింత ప్రగతి సాధించాలంటే జగనన్నను ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, ఏపీఎం కవిత, నాయకులు దామోదరరెడ్డి, సంఘమిత్ర సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించండి


మాట్లాడుతున్న జలజీవన్ మిషన్ కోఆర్డినేటర్ కరుణాకరన్

పాలసముద్రం : గ్రామీణ ప్రాంతాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వం లక్ష్యమని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ సచివాలయ సిబ్బందికి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమంత్ కుమార్, మండల జలజీవన్ మిషన్ కోఆర్డినేటర్ కరుణాకరన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వడంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కో–ఆర్డినేటర్ కరుణాకరన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఇంటింటికీ కొళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వడమే ఉద్దేశమన్నారు. 2023–24 నాటికి పనులు పూర్తి చేసి తాగునీరు అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ శివప్రకాష్ రాజు, వైస్ ఎంపీపీ పుష్ప, మండల విస్తరణాధికారి రమేష్, గ్రామ సచివాలయ సిబ్బంది, హౌసింగ్ ఏఈ మధు, ఎంపీటీసీలు, సర్పంచులు, పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంతో జిల్లా కలెక్టర్ భేటీ


జిల్లా నూతన కలెక్టర్ షన్మోహన్‌ను సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామిని సోమవారం జిల్లా నూతన కలెక్టర్ షన్మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్త కలెక్టర్‌కు డిప్యూటీ సీఎం పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించారు. అనంతరం డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ జిల్లాలో భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షన్మోహన్ మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ సందర్భంగా జిల్లా నూతన కలెక్టర్‌ను సన్మానించారు.

జనం నినాదం- జగనన్నే మా భవిష్యత్


గోపిశెట్టిపల్లిలో ఓ ఇంటికి జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్ అంటిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


పాచిగుంట ఎస్సీ కాలనీలో జగనన్న స్టిక్కర్లను అంటిస్తున్న ఎంపీపీ అనితారెడ్డి

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, భవిష్యత్‌లోనూ మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రతి ఇంటా కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. సోమవారం మండలంలోని సురేంద్రనగరం, డీఎం పురం, కేఎంపురం, కొటార్వేడు, గోపిశెట్టిపల్లి, కత్తెర పల్లిల్లో పర్యటించారు. అలాగే సచివాలయ కన్వీనరు, గృహ సారథులు, వలంటీర్లతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజా మద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్న లను లబ్ధిదారులను అడిగి సమాధానం రాబట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ మండల కన్వీనర్ ధనంజయ వర్మ, ఎంపీటీసీ మురగయ్య, మాజీ సర్పంచ్ అంకయ్య పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి విశేష స్పందన

వెదురుకుప్పం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నట్లు గృహసారథుల కన్వీనర్ బట్టే సుబ్రమణ్యం అన్నారు. సోమవారం మండలంలోని పచ్చికాపల్లం, తిరుమలయ్యపల్లె, బొమ్మయ్య పల్లె, బ్రాహ్మణపల్లె, ఆళ్లమడుగు, పెరు మాళ్లపల్లె, గ్రామ సచివాలయాల పరిధిలో జగన న్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి మానమ్మకం నువ్వే జగనన్న నినాదంతో ఉన్న స్టిక్కర్లు అతికించి లబ్ధిదారుల అభిప్రాయాలను నమోదు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఐండి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చెంగల్‌రెడ్డి, గాండ్ల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పురుషోత్తం, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వడమాలపేట : రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని జేసీఎస్ కన్వీనర్ సురేష్‌రాజు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పత్తిపుత్తూరు, బాలినాయుడు కండ్రిగ, వడమాలపేట, టీసీ అగ్రహారం, తిరుమణ్యం సచివాలయం పరిధిలో మా నమ్మకం నువ్వే జగన్–జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఆయన స్థానిక నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడు సీఎం జగనన్న ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు నవరత్నాలు, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వారు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా పొందిన వివరిస్తూ, ఐదు ప్రశ్నలు అడుగుతూ వారి సమక్షంలో ప్రభుత్వం ఇచ్చిన నంబర్‌కు వారి ఫోన్ నుంచి మిస్డ్ కాల్ ఇచ్చారు. అనంతరం ఇంటి యజమాని సమక్షంలో జగనన్న స్టిక్కర్ అతికించారు. కార్యక్రమంలో పత్తిపుత్తూరు సర్పంచ్ తులసి, ఎంపీటీసీ ప్రతిమ, వెంటరెడ్డి పాల్గొన్నారు.

గ్రామగ్రామాన 'జగనన్నే మా భవిష్యత్'

పుత్తూరు రూరల్: ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో ఉన్నారని రామసముద్రం సర్పంచ్ కుమారస్వామి తెలిపారు. సోమవారం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరిలో మంత్రి రోజమ్మ, రాష్ట్రంలో జగనన్న నాయకత్వాన్ని స్వాగతిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండలంలోని పాచిగుంట, బుక్కాపట్నం పంచాయతీల్లో సోమవారం ఎంపీపీ అనితారెడ్డి, బుక్కాపట్నం సర్పంచ్, మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డి, స్థానిక నాయకుడు దామోదరశెట్టి, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి జగనన్న స్టిక్కర్లను అంటించారు. పలువురు మహిళలు మాట్లాడుతూ తాము సీఎం జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్నామని సంతోషం వ్యక్తం చేశారు.

వైభవంగా మండలాభిషేక మహోత్సవం


నాగాలమ్మకు హారతి ఇస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

పుత్తూరు రూరల్: పట్టణంలోని రైల్వే క్వార్టర్స్‌లో నూతనంగా నిర్మించిన శ్రీనాగాలమ్మ ఆలయంలో సోమవారం మండలాభిషేక మహోత్సవం వైభవంగా జరిగింది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గణపతి పూజ, గణపతి హోమం, లక్ష్మీ హోమం, లఘుపూర్ణాహుతి పూజలు మంత్రి చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం నాగాలమ్మ పరివార దేవతలు గణపతి, మానసాదేవి, సుబ్రమణ్యస్వామి, నాగప్రతిమలకు మండలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ డి.జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలీప్‌మొదలి, ఈశ్వరాలయం, ఆరేటమ్మ ఆలయాల చైర్మన్లు కె.రమేష్‌బాబు, కె.మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్ భానుమతి, ఆలయ నిర్వాహకులు సూర్యనారాయణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వారం ఏర్పాటు


ముఖద్వారం ఏర్పాటులో పాల్గొన్న అధికారులు

పాలసముద్రం : ఆలయాలు అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ శివప్రకాష్ రాజు తెలిపారు. సోమవారం ఆయన మండల వతవలం గ్రామంలో వెలసిన గోవర్ధనాధీశ్వర ఆలయ మరమ్మతు పనులను ఆయన క్షేత్రస్థాయిల్లో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పురాతన గోవర్ధనాధీశ్వర ఆలయం మరమ్మతుల కోసం డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో రూ.2.50 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఆలయ మరమ్మతు పనులు వేగంగా జరుతున్నాయని, త్వరలోనే పూర్తి చేసి ఆలయ ప్రారంభోత్సవం చేస్తామన్నారు. అనంతరం ఆలయ అర్చకుడు సరస్వతి పూజలు చేసి ఆలయ ముఖద్వారం పెట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ శ్రీనివాసన్, ఆలయ కమిటీ మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.